నర్సింగరావుకు నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి

బాధిత కుటుంబానికి పరామర్శ

పర్వతగిరి, ఫిబ్రవరి 13: మండలంలోని ఏనుగల్లుకు చెందిన బొంపెల్లి నర్సింగరావు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం గ్రామానికి చేరుకొని నర్సింగ రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దయాకర్‌రావు వెంట పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీ నారాయణరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొంపెల్లి దేవేందర్ రావు, మాజీ ఉపసర్పంచ్ సతీశ్‌రావు ఉన్నారు.

బియ్యం పంపిణీలో జాప్యం

కాశీబుగ్గ, ఫిబ్రవరి 13: రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం జరుగుతున్నదని రేషన్ డీలర్ల వరంగల్ మండల కమిటీ గురువారం జిలా పౌరసరఫరాల అధికారితోపాటు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. ఎనుమాముల గిడ్డంగి నుంచి బియ్యం సరఫరాలో ఆలస్యం అవుతున్నదని తెలిపారు. బియ్యం పంపిణీలో ఈ నెల 25 వరకు గడువు ఇవ్వాలని రేషన్ డీలర్లు కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- గర్భిణులను నిరంతరం మానిటరింగ్ చేయాలి
- వైద్యులు విధిగా సమయపాలన పాటించాలి
- సమీక్షలో కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, ఫిబ్రవరి 13: జిల్లాలోని ప్రభుత్వ వైద్య శాలల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎంజీఎంహెచ్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, ప్రభుత్వ ప్రసూతి దవాఖాన, ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి, నర్సంపేట మెడికల్ కళాశాల, ఆసుపత్రి, నర్సింగ్ కాలేజ్, వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, సాధించిన లక్ష్యాలు, అవసరాలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. పరీక్షా నమూనాలు టీహబ్ ద్వారా త్వరగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

లక్ష్యాలను సాధించాలి

లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గుర్తించి, లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావును కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దవాఖానలో పేషంట్ల హక్కులు, కర్తవ్యం వివరాలు తెలిపే బోర్డులు ప్రదర్శించాలన్నారు. సీకేఎం ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, సివిల్ వర్క్స్ కోసం వెంటనే ప్రతిపాదనలు అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రోగుల సౌకర్యార్థం ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఆప్తామిక్ సర్జన్‌ను డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సంపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆన్‌లైన్ తరగతులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో శవ పరీక్షల కేంద్రం మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో వెంటనే ఆటో జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సాంబశివరావు, సూపరింటెండెంట్లు డాక్టర్ కిశోర్, డాక్టర్ నరసింహస్వామి, డాక్టర్ భరత్‌కుమార్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రామ్మూర్తి, ఆర్ఎంవోలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సత్యజిత్ రే, వైద్యాధికారులు రాజు, లత పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి

యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఫౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 2024-25 యాసంగి సీజన్‌లో 2,10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనే అంచనా ఉందన్నారు. 2023-24 వానకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ 100 శాతం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోదాముల్లో ధాన్యం నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాన్నారు. రైస్ మిల్లర్ల నుంచి బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ నుంచి సరఫరా అవుతున్న బియ్యం దుర్వినియోగం కాకుండా నిఘా పెట్టాలన్నారు. అలాగే, వ్యవసాయానికి అవసరమ్యే ఎరువులు, క్రిమిసంహారక మందులను అందుబాటులో ఉంచాలని డీఏవోను ఆదేశించారు. ఎనుమాముల మార్కెట్‌లో ఇందిరా మహిళా క్యాంటీన్ ఏర్పాటు, లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎస్‌వో కిష్టయ్య, డీఎం సంధ్యారాణి, డీఏవో అనురాధ, మార్కెటింగ్ అధికారి సురేఖ, డీసీవో నీరజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పీఎంశ్రీ, సర్వశిక్షా అభియాన్ పథకాల కింద చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, మరమ్మతుల పురోగతిపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పీఎంశ్రీ పథకం కింద పాఠశాలల అభివృద్ధి కోసం రూ. 1.38 కోట్ల వ్యయంతో మంజూరైన 14 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే, సర్వశిక్షా అభియాన్ పథకం కింద రూ. 45.40 లక్షల వ్యయంతో 12 ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ లాబరేటరీల ఏర్పాటు పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో డీఆర్వో విజయలక్ష్మి, డీఈవో జ్ఞానేశ్వర్, ఎంఈవోలు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పీ రవికుమార్

మిర్చియార్డును సందర్శించిన రవికుమార్

కాశీబుగ్గ, ఫిబ్రవరి 13: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతులు, వ్యాపారుల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని త్వరలోనే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ అన్నారు. వరంగల్ మార్కెట్‌లోని మిర్చి యార్డును గురువారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. అలాగే, మార్కెట్ ప్రాంగణంలోని పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం చాంబర్ ప్రతినిధులతోపాటు మిర్చి వ్యాపారులతో సమావేశమయ్యారు. త్వరలోనే సీసీ కెమెరాల ఏర్పాటు, పీవోసీ మిషన్ల ఖరీదు, విద్యుత్ లైటింగ్, పారిశుధ్య పనుల నిర్వహణ, సిబ్బంది పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో డీడీఎం వొడితల పద్మావతి, కార్యదర్శి గుగులోత్ రెడ్యా, చాంబర్ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేదప్రకాశ్, మిర్చి సెక్షన్ అధ్యక్షులు కరాని రాజు, అడ్డి సెక్షన్ అధ్యక్షుడు ఎన్‌రెడ్డి లింగారెడ్డి, గ్రేడ్-2 కార్యదర్శులు శ్రీరామోజు రాము, ధన్నపునేని అంజిత్‌రావు, అసిస్టెంట్ సెక్రటరీ గంధమల్ల రాజేందర్, సుకన్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం : పరుపాటి

రాయపర్తి, ఫిబ్రవరి 13: మండలంలోని ఆలయాల సమగ్రాభివృద్ధికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సారథ్యంలో సంపూర్ణ సహకారం అందిస్తానని బీఆర్ఎస్ జిల్లా జిల్లా నాయకుడు, సంస్థ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కొత్త రాయపర్తిలోని అభయాంజనేయస్వామి ఆలయం, శివాలయం, ఉమామహేశ్వరస్వామి ఆలయాలను గ్రామపెద్దలు బందెల బాలరాజు, గారె నర్సయ్య కోరిక మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహా శివరాత్రిలోగా ఆలయానికి రంగులు వేయించి తన సొంత ఖర్చులతోనే శివపార్వతుల కల్యాణోత్సవం, భక్తులకు అన్నదానం చేస్తానని చెప్పారు. అలాగే, జేతురాంతండా పరిధిలోని రావులతండాలో దుర్గామాత ఆలయాన్ని సందర్శించి ఆలయానికి పెయింటింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తండావాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తర్వాత మైలారంలో ఈ నెల 14, 15వ తేదీల్లో దుర్గమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పరుపాటి 160 మంది ఉత్సవ కమిటీ సభ్యులకు టీ షర్ట్స్ పంపిణీ చేశారు.

అడవులను సంరక్షించుకోవాలి: డీఆర్వో

ఖానాపురం, ఫిబ్రవరి 13: మానవాళి మనుగడకు ఎంతో ప్రధానమైన అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీఆర్వో రీనా అన్నారు. మండలంలోని కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు గురువారం పీఎంశ్రీలో భాగంగా పాకాల వనదర్శిని కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాకాల బయోడైవర్సిటీ పార్కు, సరస్సు, సీతాకోకచిలుకల పార్కును సందర్శించి, అడవుల విశిష్టతను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

చింతం సదానందం కుటుంబానికి పరామర్శ

వెంకటలక్ష్మికి నివాళులర్పిస్తున్న మధుసూదనాచారి

గీసుగొండ, ఫిబ్రవరి 13: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చింతం సదానందం తల్లి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందారు. గురువారం మొగిలిచెర్లకు చేసుకున్న శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ప్రదీప్‌రావు వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సదానందం కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, కార్పొరేటర్లు మనోహర్, సుంకరి మనీషా శివకుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పెద్ది పరామర్శ

దుగ్గొండి: నర్సయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న పెద్ది

దుగ్గొండి/ఖానాపురం, ఫిబ్రవరి 13: పలు కుటుంబాలను గురువారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని రేఖంపల్లికి చెందిన జన్ను అరుణ, ఈసంపల్లి శ్రీను, పొన్నం వేణు, సోమిడి అరుణ్ రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా పెద్ది వారిని కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఇదే గ్రామంలో ఇటీవల మరణించిన కానుగుల నర్సయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్ది వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్నం మొగిలి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మంద శ్రీనివాస్, పార్టీ గ్రామ అధ్యక్షుడు నీరతి మురళి, మాజీ ఎంపీటీసీ రంపీస సోనీరతన్, నాయకులు తౌటు రవి, శానబోయిన నరసింహస్వామి, వంశీ, మనోజ్, సుధాకర్, మధుకర్, యూత్ నాయకులు పాల్గొన్నారు. అలాగే, ఖానాపురం మండలకేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఎనిమిదో వార్షికోత్సవ పూజల్లో పెద్ది పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కొణతం అరుణ-శ్రీనివాసరెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామీనాయక్, మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో కార్మికులకు అన్యాయం'

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి రవి అన్నారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో గురువారం జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మిక సంక్షేమానికి గతంలో రూ. 56 వేల కోట్లు ప్రకటించిన కేంద్రం రూ. 20 వేల కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఈ సంవత్సరం రూ. 49 వేల కోట్లు మాత్రమే ప్రకటించిందన్నారు. అలాగే, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు.

స్త్రీనిధి రుణ బకాయిలు వసూలు చేయాలి: డీఆర్డీవో

మాట్లాడుతున్న డీఆర్డీవో కౌసల్యాదేవి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 13: స్త్రీనిధి రుణ బకాయిలను సకాలంలో వసూలు చేయాలని డీఆర్డీవో కౌసల్యాదేవి ఆదేశించారు. వరంగల్ డీఆర్డీఏ కార్యాలయంలో గురువారం స్త్రీనిధి బకాయి వసూళ్లపై వీవోలు, వీవోఏలతో సమీక్షించారు. వసూళ్లలో అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీవోఏలు, వీవోలు నెలసరీ సమావేశాలకు విధిగా హాజరు కావాలన్నారు. అప్పు చెల్లింపులను బుక్‌లో నమోదు చేయాలన్నారు. సమీక్షలో ఏడీఆర్డీవో రేణుకాదేవి, డీపీఎం మునగాల దయాకర్, అనిత, శ్రీనిధి ఆర్ఎం సైదిరెడ్డి, మేనేజర్ కపిల్, వివోఏలు ఆకుల స్రవంతి, రమ్య, సుజాత, ఇందిరా పాల్గొన్నారు.

అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు

నెక్కొండ, జనవరి 13: అటవీ శాఖ భూముల్లో బావులు తవ్విన రెండు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేయడంతోపాటు అటవీ శాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సోమిరెడ్డి సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. గూడూరు మండలం సూర్యతండా శివారులోని అటవీ శాఖ భూమిలో బావులు తవ్వుతుండగా విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు యంత్రాలను నర్సంపేటకు తీసుకెళ్లారు. దీంతో ఓనర్లు, సూర్యతండా వాసులు అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. యంత్రం ఓనర్ ముత్యాల శంకర్, జగిత్యాల శ్రీనివాస్, సురేశ్, సూర్యతండా వాసులు భూక్యా దేన్యా, భూక్యా బాలాజీ, భూక్యా వీరన్న, మూడు యాకయ్యతోపాటు మరికొందరు పారెస్ట్ అధికారులను చంపుతామని బెదిరించారు. అదేవిదంగా నాగారంలో వ్యవసాయ బావులు తవ్వుతుండగా, రెండు యంత్రాలను సీజ్ చేసి నర్సంపేటలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

ఫ్లెక్సీల తొలగింపు

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 13: వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎట్టకేలకు గురువారం తొలగించారు. 'ఫ్లెక్సీ తొలగించరూ.. అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో ఈ నెల 11న కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కార్పొరేషన్ సిబ్బంది సదరు నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

రాయపర్తి, ఫిబ్రవరి 13: బాల్‌నాయక్‌తండా పరిధి రాజు నాయక్‌తండాలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ తెలిపారు. తండాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోతుండడంతో అతని ఇంటిని సిబ్బంది తనిఖీ చేశారు. దీంతో 30 బస్తాల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని బానోత్ సూర్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

ఖానాపురం: మండలంలోని నాజీతండా, బోటిమీది తండా, మంగళవారిపేట లో గుడుంబ స్థావరాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 13 వంద లీటర్ల చక్కర పానకాన్ని ధ్వంసం చేసి, 57 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు.

చర్చి స్థలం పరిశీలన

కాశీబుగ్గ, ఫిబ్రవరి 13: వరంగల్ 14వ డివిజన్ బాలాజీనగర్‌లో బైబిల్ పెంత కోస్టల్ చర్చి ఆరాధన జరిగే స్థలాన్ని వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎనుమాముల సీఐ అలే రాఘవేందర్ గురువారం సందర్శించారు. ఎలాంటి అనుమతి లేకుండా కొన్ని రోజులుగా చర్చి నిర్వహిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. సౌండ్ పొల్యూషన్‌తో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. స్థానిక నాయకుడు ఇంతియాజ్ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ ఇక్బాల్‌కు ఫోన్‌లో ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు.

పాఠశాలలో రికార్డుల పరిశీలన

కరీమాబాద్, ఫిబ్రవరి 13: పిల్లలను ఉత్తములుగా తీర్చి దిద్దాల్సిన ఉపాధ్యాయులే అక్రమ మార్గాల్లో వెళ్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించాల్సిన ప్రైవేట్ పాఠశాలలు కాసులకు కక్కుర్తి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని నాగమయ్య అర్చి సమీపంలో ఉన్న రెనాల్డ్స్ పాఠశాలలో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదు మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పాతముగ్ధంపురాన్ని గురిజాలలో కలపొద్దు

నర్సంపేట, ఫిబ్రవరి 13: మండలంలోని పాతముగ్ధంపురం గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీలో కలపొద్దని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పరికి మధుకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చంద్రకళకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, రమేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కరీమాబాద్, ఫిబ్రవరి 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఆర్ఆర్‌తోటలో గురువారం ఎంసీపీఐ(యూ) ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టినా సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రతాప్, జగదీశ్వర్, నగేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

కరీమాబాద్, ఫిబ్రవరి 13: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి నిర్మల గీతాంబా అన్నారు. ఉర్సులో రుద్రమదేవి స్వచ్ఛంద సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మల గీతాంబా మాట్లాడుతూ మహిళలు కుటుంబ బాధ్యతలతో ఎక్కువగా అనారోగ్యాల బారిన పడుతుంటారని తెలిపారు. కుటుంబంతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని కోరారు. మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సాయికుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్ సింగ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఐదుగురికి గాయాలు

నర్సంపేట, ఫిబ్రవరి 13: ప్రమాదవశాత్తు వడ్ల బస్తాల బెడ్లు(నెట్లు) కూలి ఐదుగురు హమాలీ కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలోని పాకాలరోడ్డు చింతగడ్డతండా ఉషా కిరణ్ రైస్ మిల్లులో గురువారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చింతగడ్డతండాకు చెందిన హమాలీలు భూక్యా స్వామి, గుగులోత్ కవిత, భూక్యా సాలమ్మ, అజ్మీరా కవిత, బానోత్ స్వామి గురువారం ఉదయం పనులు చేసేందుకు ఉషా కిరణ్ మిల్లుకు వెళ్లారు. బెడ్ల నుంచి ధాన్యం బస్తాలను దించుతుండగా నెట్లు కూలి కార్మికులపై పడ్డాయి. బస్తాల మధ్యలో ఇరుక్కున వారిని బయటకు తీసి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేశారు.

'పోలింగ్ కేంద్రాలను 50కి పెంచాలి'

నర్సంపేట, ఫిబ్రవరి 13: మండలంలో ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలను 50కి పెంచాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ కోరారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో దాదాపు 22 వేల జనాభా ఉందని, కేవలం 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలందరూ ఓటుహక్కు వినియోగించుకునేందుకు సమయం సరిపోవడం లేదన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పోలింగ్ కేంద్రాలను 50కి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జీలు కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మోతె పద్మనాభరెడ్డి, మోటూరి రవి, కందుల రాజిరెడ్డి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పురస్కార రచనలకు ఆహ్వానం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 13: శ్రీలేఖ సాహితీ వరంగల్ ఆధ్వర్యంలో చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక సాహిత్య పురస్కారం కోసం రచనలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు టి.శ్రీరంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9949857955 సెల్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

సుందరం హోమ్
నమోదిత కార్యాలయం: నెం. 21, పటుల్లాస్ రోడ్, చెన్నై-600 002.
కార్పొరేట్ కార్యాలయం: సుందరం టవర్స్, నెం. 46, వైట్స్ రోడ్, చెన్నై-600 014.
శాఖ కార్యాలయం: 1వ అంతస్తు, ''కందకట్ల గేట్‌వే'', కెయుసి క్రాస్ రోడ్, నయీమ్‌నగర్, హన్మకొండ, వరంగల్-506009, ఫోన్ నెం. 0870-2441244.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) మరియు అనుబంధం IVతో చదువబడే సెక్షన్ 13(4) క్రింద జారీ చేయబడినది
సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (SARFAESI) యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతకు డిమాండ్ నోటీసులు జారీచేసి, సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా డిమాండ్ నోటీసులలో తెలిపిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. రుణగ్రహీత(లు) బకాయి మొత్తాన్ని పూర్తిగా తిరిగి చెల్లించుటలో విఫలం కావడం చేత, SARFAESI యాక్ట్‌లోని రూల్ 8తో చదవబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి అధీకృత అధికారి దిగువ వివరించబడిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లో సబ్-సెక్షన్ (8) నిబంధన గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది. సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీ నిర్వహించరాదని మరియు సదరు ఆస్తితో నిర్వహించబ